
మానకొండూర్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, నాయకులు


చిగురుమామిడి: రేకొండలో కార్యకర్తలతో మాట్లాడుతున్న జిల్లా నాయకుడు


వీణవంకలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

# రజతోత్సవ సభకు తరలి రావాలి

సభ పోస్టర్ ఆవిష్కరించిన బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ • వివిధ మండలాల్లో ఏర్పాట్లపై నాయకుల సమీక్షలు

మానకొండూర్/ సైదాపూర్/ తిమ్మాపూర్/ చిగురుమామిడి/ వీణవంక/ శంకరపట్నం, ఏప్రిల్ 26: నేడు ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు గులాబీ శ్రేణులు, అభిమానులు తరలి రావాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ పిలుపు నిచ్చారు. శనివారం మానకొండూర్ మండలంలోని ఊటూర్ గ్రామంలో పార్టీ ముఖ్యనాయకులతో కలిసి రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఉదయం గ్రామంలో పార్టీ జెండా ఎగురవేసి సభకు రావాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, నాయకులు ఎడ్ల సుగుణాకర్, ఎనగందుల సుదర్శన్, రామంచ గోపాల్‌రెడ్డి, సిరిశెట్టి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, ప్రధాన కార్యదర్శి చెల్మల్ల రాజేశ్వర్ రెడ్డి, వెన్నంపల్లి సింగిల్‌విండో చైర్మన్ బిల్ల వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బత్తుల కొమురయ్య, మండల నాయకుడు బత్తుల లక్ష్మీనారాయణ కార్యకర్తలతో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. రజతోత్సవ సభకు ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తిమ్మాపూర్ మండలంలోని గ్రామగ్రామానికి బస్సులు అందుబాటులో పెడుతామని, కార్యకర్తలతో పాటు అభిమానులు అధిక సంఖ్యలో రావాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

చిగురుమామిడి మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం సభ సన్నాహక సమావేశాలు నిర్వహించారు. సభకు భారీగా తరలిరావాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, జిల్లా నాయకుడు సాంబారీ కొమురయ్య, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి సభకు ఆహ్వానించారు. ఇక్కడ నాయకులు నల్ల రాజేందర్ రెడ్డి, బిళ్ల వెంకటరెడ్డి, కంప అశోక్, సందీప్ రెడ్డి, దిలీప్ రెడ్డి వివిధ గ్రామాల అధ్యక్షులు ఉన్నారు.

వీణవంక మండల కేంద్రంలోని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నివాసంలో శనివారం జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వాల బాలకిషన్‌రావు, మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక–తిరుపతిరెడ్డి, మాజీ జడ్పీటీసీ మాడ వనమాల–సాధవరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలం నుంచి వాహనాలు ఏర్పాటు చేశామని, మధ్యాహ్నం 12 గంటలకు భారీ సంఖ్యలో తరలి వెళ్లాలని కోరారు. ప్రజల పక్షాన నిలబడి కొట్లాడే నాయకుడు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అని, ఆయనపై కమలాపూర్ మండలం గుండేడు గ్రామంలోని క్వారీ నిర్వాహకుడు అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాయిశెట్టి లత–శ్రీనివాస్, గ్రామాధ్యక్షుడు మహేశ్, మాజీ ఎంపీటీసీ సంజీవరెడ్డి, నాయకులు పొదిల రమేశ్, మేక సమ్మయ్య, రాజయ్య, ప్రకాశ్, రవి, సురేశ్, కృష్ణచైతన్య, సంపత్‌రెడ్డి, మధు, రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్, తిరుపతి, సందీప్ పాల్గొన్నారు.

శంకరపట్నం మండలం నుంచి సభకు 35 బస్సులు, కార్లు, తదితర వాహనాల్లో 2 వేల మందికి పైగా తరలి వెళ్లనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గంట మహిపాల్ తెలిపారు. శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కార్యకర్తలు నిర్ణీత సమయానికి ముందే బయలుదేరి సభను సూపర్ సక్సెస్ చేయాలని కోరారు.

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 26: మండలంలోని 17 గ్రామాల నుంచి 40 బస్సులు, ఇతర వాహనాల్లో యువత, పార్టీ అభిమానులు భారీగా రజతోత్సవ సభకు తరలిరానున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి తెలిపారు.

## సభ కోసం అర్చకుడు రూ.10వేల విరాళం

శంకరపట్నం, ఏప్రిల్ 26: ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ సక్సెస్‌ను కాంక్షిస్తూ మొలంగూర్ గ్రామానికి చెందిన అర్చకుడు, బీఆర్ఎస్ అభిమాని తన అభిమానాన్ని చాటుకున్నారు. సభ నిర్వహణ కోసం రూ.10 వేల విలువైన చెక్కును శనివారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంట మహిపాల్‌కు అందజేసి, మాట్లాడారు. ఐదేండ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధించిందన్నారు. తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి మరోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని తాను ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. 27న జరుగుతున్న ఎల్కతుర్తి బహిరంగ సభ సూపర్ సక్సెస్ అవుతుందని జోస్యం చెప్పారు. ఈ మేరకు తాను ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మొత్కూరి సమ్మయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఉమ్మెంతల సతీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మ్యాకల కుమార్, కొత్తగట్టు టెంపుల్ మాజీ చైర్మన్ తూముల శ్యాంరావు, సీనియర్ నాయకుడు పార్థసారథి పాల్గొన్నారు.


మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గంట మహిపాల్‌కు విరాళం చెక్కును అందజేస్తున్న అర్చకుడు బంగిమఠం నాగరాజు

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


లబ్ధిదారుకు సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి గంగుల కమలాకర్

కార్పొరేషన్, ఏప్రిల్ 26: కరీంనగర్ నియోజకవర్గంలోని సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చెక్కులను అందించారు. నియోజకవర్గంలోని 81 మందికి రూ.21,73,500 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందే వారికి ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు తోట రాములు, వాల రమణారావు, కంసాల శ్రీనివాస్, నాంపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 'భూ భారతి'పై అవగాహన సదస్సు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 26: కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామంలోని రైతువేదికలో శనివారం భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. భూ భారతిపై రైతులకు అవగాహన కల్పించారు. రికార్డుల్లో తప్పుల సవరణ, వ్యవసాయ భూములు రిజిస్ట్రేషన్, తదితర అంశాలను గురించి వివరించారు. కార్యక్రమంలో కరీంనగర్ సుడా చైర్మన్ కొమటిరెడ్డి నరేందర్ రెడ్డి, తహసీల్దార్ సీహెచ్ రాజు, ఏడీఏ రణధీర్, ఎంపీడీవో సంజీవరావు, ఏవో బి. సత్యం, ఇతర అధికారులు, వివిధ గ్రామాల రైతులు, నాయకులు పాల్గొన్నారు.

### అపరిష్కృత సమస్యలపై కలెక్టర్‌కు రైతుల వినతి

దుర్శేడ్ రైతువేదికలో భూ భారతి అవగాహన సదస్సుకు వచ్చిన రైతుల్లో పలువురు తమ అపరిష్కృత సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. అయితే, తిరిగి కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని, తప్పకుండా పరిష్కరిస్తామంటూ కలెక్టర్ హామీ ఇచ్చి వెళ్లిపోగా, ఆమె సమాధానానికి సంతృప్తి చెందని రైతులు, ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలంటూ ఆవేదన చెందుతూ వెనుదిరిగారు.

## జీవీఆర్ పరామర్శ

మానకొండూర్, ఏప్రిల్ 26: ఊటూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ ఉషాకోయిల లక్ష్మణ్ మాతృమూర్తి లచ్చవ్వ ఇటీవల మృతి చెందగా, శనివారం కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పరామర్శించారు. లచ్చవ్వ మృతికి కారణాలు అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, నాయకులు రామంచ గోపాల్‌రెడ్డి, ఎడ్ల సుగుణాకర్, ఎనగందుల సుదర్శన్ తదితరులు ఉన్నారు.

## ఐదో రోజుకు సహాయ ఆచార్యుల నిరవధిక సమ్మె

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 26: శాతవాహన విశ్వవిద్యాలయంలో కాంట్రాక్టు, పార్ట్ టైమ్ సహాయ ఆచార్యుల నిరవధిక సమ్మె శనివారం ఐదో రోజుకు చేరింది. వారికి శాతవాహన విశ్వవిద్యాలయ బోధనేతర సిబ్బంది సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బోధనేతర సిబ్బంది సంఘం ప్రధాన కార్యదర్శి పి. ప్రసాద్ మాట్లాడుతూ, కాంట్రాక్టు, పార్ట్ టైం అధ్యాపకులను త్వరగా క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సంతోష్, శ్రీకాంత్, మారుతీ, బోధనేతర సిబ్బంది నాయకులు భీమయ్య, నర్సయ్య, రమేశ్, విజయ్ కుమార్, ప్రకాశ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదులతో మైనార్టీల మనుగడకు ముప్పు

కలెక్టరేట్, ఏప్రిల్ 26: హిందూ, ముస్లింలు సోదరభావంతో జీవనయానం సాగిస్తున్న దేశంలో ఉగ్రవాదులు కొనసాగిస్తున్న అసాంఘిక కార్యకలాపాలతో ముస్లిం మైనార్టీల మనుగడకు ముప్పుగా పరిణమిస్తున్నాయని మైనార్టీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎండి.షాకీర్ ఆరోపించారు. జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల జరిగిన దారుణ మారణకాండను నిరసిస్తూ, ఆసంఘం జిల్లాశాఖ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని సంఘ కార్యాలయంలో ఉగ్రమూకల దాడిలో మరణించిన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంతాపసభలో మాట్లాడుతూ, మతాలకతీతంగా దేశంలో అన్ని వర్గాల ప్రజలు కలిసి మెలసి జీవిస్తుండగా, కొంతమంది తమ స్వార్థ ప్రయోజనాల కోసం మతఛాందసవాదాన్ని పెంపొందిస్తూ, అశాంతిని రేకెత్తించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అసాంఘిక శక్తుల ఆటకట్టించేందుకు కులాలు, మతాలకతీతంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఇఫ్తేకార్, ఇంతియాజ్, ఫరూక్, రజాక్‌బాయి, రఫీయొద్దీన్, అక్బర్, అయూబ్ పాషా పాల్గొన్నారు.

## ఎస్సారార్‌లో మూడో అకాడమిక్ కౌన్సిల్ సమావేశం

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 26: జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ అధ్యక్షతన మూడో అకాడమిక్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కళాశాలకు 2022–23 లో అటానమస్ హోదా వచ్చిందని, ఈ సంవత్సరం మూడో సంవత్సర విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని, ఈ కళాశాలలో విద్యార్థులకు అవసరమైన కరిక్యులం రూపొందించినట్లు వివరించారు. పరిశ్రమలతో అనుసంధానం చేస్తూ నూతన సిలబస్‌ను తయారు చేసినట్లు తెలిపారు. అటానమస్ కోఆర్డినేటర్ డాక్టర్ వంగల శ్రీనివాస్ అకాడమీ కౌన్సిల్ రిపోర్టును ఈ సమావేశంలో ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఎడవల్లి రాజ భాస్కర్ రెడ్డి, శాతవాహన యూనివర్సిటీ నుంచి డాక్టర్ సరసిజ, డాక్టర్ సురేశ్, డాక్టర్ పద్మావతి, కళాశాల గవర్నింగ్ బాడీ సభ్యుడు డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి సమావేశంలో పాల్గొని కళాశాల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి పలు సూచనలు చేశారు. సమావేశంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి. నితిన్, టి. రాజయ్య, కౌన్సిల్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల వీడ్కోలు సంబురాలు



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 26 : జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలోని కామర్స్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు మూడో సంవత్సరం విద్యార్థులకు సయోనార పేరుతో ఏర్పాటు చేసిన వీడ్కోలు సంబురాలు అలరించాయి. ఈ వీడ్కోలు సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య రామకృష్ణ అధ్యక్షత వహించగా, విశిష్ట అతిథిగా తెలంగాణ ప్రభుత్వ కళాశాల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేందర్ రెడ్డి హాజరై విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## కౌలు రైతుల నమోదు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 26: దుర్శేడ్ రైతు వేదికలో కౌలు రౌతుల నమోదు కార్యక్రమాన్ని శనివారం ఏఈవోలు పైడి తల్లి, స్వర్ణలత, తాళ్లపల్లి సుచరిత చేపట్టారు. ఇతరుల భూములకు కౌలు చేస్తున్న వారు పేర్లు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎలబోతారం మాజీ ఎంపీటీసీ చల్ల లింగారెడ్డి, ఏవో బి. సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న తన్విక ఆభరణాల ప్రదర్శన

విద్యానగర్, ఏప్రిల్ 26: కరీంనగర్ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో అక్షయ తృతీయను పురస్కరించుకొని డివైన్ అనే ప్రత్యేక బ్రాండ్ కింద తన్విక అనే కొత్త ఆభరణాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమాన్ని కరీంనగర్ మాజీ డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా మలబార్ స్టోర్ హెడ్ ఫవాజ్ మాట్లాడుతూ, అక్షయ తృతీయ వేడుకల్లో భాగంగా బంగారు ఆభరణాల తరుగు చార్జీలపై 25% తగ్గింపు ఉందని, ప్రీసియ, ఎరా, స్టడెడ్, స్టోన్స్ అంకట్ డైమండ్ ఆభరణాల తరుగు చార్జీలపై ఫ్లాట్ 25 శాతం తగ్గింపు లభిస్తుందని తెలిపారు. ఈ ఆఫర్ ఈనెల 30 వరకు మాత్రమే ఉందని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ సంజయ్, స్టోర్ మేనేజర్ సోహల్, మార్కెటింగ్ ఇన్‌చార్జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మహారుద్ర, శ్రీసూక్త, గేయరామాయణ మహోత్సవం


మహారుద్ర, శ్రీసూక్త, గేయరామాయణ మహోత్సవంలో పాల్గొన్న రంగంపేట గురు మదనానంద సరస్వతీ పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి

కమాన్ చౌరస్తా, ఏప్రిల్ 26 : అఖిల బ్రాహ్మణ సేవా సంఘం కరీంనగర్ శాఖ సౌజన్యంతో గాయత్రీనగర్ గణేశ శారదా శంకరాలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మహారుద్ర, శ్రీసూక్త, గేయరామాయణ మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. పుణ్యాహవాచనం అనంతరం రుద్ర, శ్రీమాత్రే నమః, శ్రీసూక్త పారాయణాలు జరిగాయి. రంగంపేట గురు మదనానంద సరస్వతీ పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి ప్రత్యక్ష పర్యవేక్షకులుగా హాజరై మాట్లాడుతూ, ధర్మసూత్రాలు, ప్రవచనాలు వింటే లాభం లేదని.. వాటిని ఆచరణలో పెట్టాలని సూచించారు. అప్పుడే ధర్మసంస్థాపన సాధ్యమన్నారు. తల్లిదండ్రులు, గురువులు, పెద్దలను గౌరవించాలన్నారు. ప్రతి మనిషితో ప్రేమపూర్వకంగా మెదలాలని ఉద్బోధించారు. కార్యక్రమంలో అఖిల బ్రాహ్మణ సేవా సంఘం కరీంనగర్ అధ్యక్షుడు కస్బా భూమేశ్వరరావు, గణేశ శారద శంకర ఆలయం కమిటీ అధ్యక్షుడు బండపెల్లి ఉపేందర్ శర్మ, ప్రధాన కార్యదర్శులు రామక విఠల్ శర్మ, పురం ప్రేమ్ చందర్ రావు, మూగు హరిశంకర్ నాగశర్మతో పాటు బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## మెజిస్ట్రేట్లకు వీడ్కోలు సత్కారం

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 26: హుజూరాబాద్ కోర్టులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, రెండో అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై వెళ్లిన న్యాయమూర్తులు అలేఖ్య, గేదెం స్వాతిని బార్ అసోసియేషన్ హుజూరాబాద్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సమావేశానికి సీనియర్ సివిల్ జడ్జి పిబీ. కిరణ్ కుమార్, మొదటి అదనపు మెజిస్ట్రేట్ పద్మ సాయి శ్రీ ముఖ్య అతిథులుగా హాజరుకాగా, కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యతిపతి అరుణ్ కుమార్, జనరల్ సెక్రటరీ ఎర్రోళ్ల రమేశ్, ఉపాధ్యక్షుడు నూతాల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యురాలు శిరీష, లైబ్రేరీ సెక్రటరీ భానుకిరణ్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## రేణిగుంట ప్రమాదంలో మరొకరి మృతి

తిమ్మాపూర్, ఏప్రిల్ 26: ఈ నెల 24న రేణికుంట వద్ద లారీ ఆటో ఢీకొన్న ప్రమాదంలో మృతుల సంఖ్య ముగ్గురికి చేరింది. ఆటో డ్రైవర్, మరో ప్రయాణికురాలు అదే రోజు మరణించగా.. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మరో విద్యార్థి మృతి చెందాడు. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మాచాపూర్ గ్రామానికి చెందిన పొన్నం సాయికిరణ్(18) తిమ్మాపూర్ మండల కేంద్రంలోని జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో గత గురువారం కాలేజీకి వెళ్లేందుకు ఆటోలో వస్తుండగా రేణికుంట వద్ద వారు ప్రయాణిస్తున్న ఆటోను రోడ్డుపైకి ఎక్కుతున్న లారీ ఢీ కొట్టింది. ఘటనలో ఆటో డ్రైవర్ కాసర్ల తిరుపతి, ప్రయాణికురాలు నక్షత్రమ్మ మృతిచెందారు. ఆటోలో ఉన్న మరో ఆరుగురు చికిత్స పొందుతుండగా, శనివారం ఉదయం సాయికిరణ్ పరిస్థితి విషమించి మరణించినట్లు ఎల్ఎండీ ఎస్ఐ వివేక్ తెలిపారు.

### చికిత్స పొందుతూ యువకుడు..

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 26: మండలంలోని చెల్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని తోకలపల్లి గ్రామ సమీపంలో వారం క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన హుజూరాబాద్ పట్టణంలోని ప్రతాప్‌వాడకు చెందిన రాజశేఖర్(18) వరంగల్‌లోని ప్రయివేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తిరుమల్ గౌడ్ తెలిపారు.

### అంత్యక్రియలకు వచ్చి అనంత లోకాలకు

పట్టణంలోని రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాజశేఖర్ అంత్యక్రియలకు వచ్చిన వ్యక్తి మురుగు కాలువలో పడి మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన ఇస్లావత్ వెంకట్(38) అనే వ్యక్తి ప్రతాప్‌వాడకు చెందిన రాజశేఖర్ తండ్రి చంద్రశేఖర్ స్నేహితుడు. ఈ క్రమంలో అంత్యక్రియలకు హాజరైన వెంకట్.. రాజశేఖర్ ఇంటి సమీపంలోని మురుగు కాలువలో పడి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## కొండపల్కల బ్యాంకులో చోరీకి యత్నం

మానకొండూర్, ఏప్రిల్ 26: కొండపల్కల తెలంగాణ గ్రామీణ బ్యాంకులో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి ప్రయత్నించారు. పెద్ద రాయితో బ్యాంక్ షెట్టర్ ఒకవైపు తాళం పగుల కొట్టారు. రెండో తాళాన్ని పగులగొట్టే ప్రయత్నం విఫలం కావడంతో పెద్దరాయిని అక్కడే వదిలి పెట్టి వెళ్లారు. చోరీకి యత్నించిన ఒకరి చెప్పులు కూడా ఘటనాస్థలంలోనే వదిలి వెళ్లారని స్థానికులు తెలిపారు. దీనిపై బ్యాంకు సిబ్బంది నుంచి ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

## మెడలో నుంచి పుస్తెలతాడు చోరీ

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 26: వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన కన్నబోయిన కోమల మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తి పుస్తెలతాడు లాక్కెళ్లాడు. ఆమె కథనం ప్రకారం.. కోమల శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి ముందు నిద్రించారు. ఈ క్రమంలో అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని పుస్తలతాడు తెంపుకొని వెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తిరుమల్ గౌడ్ తెలిపారు.

## వృద్ధుడి అనుమానాస్పద మృతి

- మూడు రోజులుగా మార్చురీలోనే మృతదేహం
- విచారణకు సహకరించిన కుమారులు
- కేసు నమోదు చేసిన పోలీసులు

మానకొండూర్, ఏప్రిల్ 26: ఓ వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా, అతడి కుమారులు.. పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయకపోవడం, విచారణకు పోలీసులకు సహకరించక పోవడంతో వారిపై మానకొండూర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. సీఐ సంజీవ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 24న వన్నారం గ్రామంలో ఓ వృద్ధుడు మృతిచెందాడని ఉదయం 8గంటలకు డయల్ 100కు కాల్ రాగా, స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ వెంకట్రామయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. జంగిలి కొమురయ్య (74) వృద్ధుడు రేకులషెడ్డులో మృతిచెంది ఉన్నాడు. కొంత కాలం నుంచి భూముల విషయమై కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరుగుతున్నాయని, తమ తండ్రి మృతిపై అనుమానం ఉందని కొమురయ్య కుమారులు జంగిలి ఓదెలు, జంగిలి రవి తెలిపారు. కానీ స్టేషన్‌కు వచ్చి ఎవరూ ఫిర్యాదు చేయలేదు. దీంతో ఘటనా స్థలానికి విచారణకు వెళ్లిన కానిస్టేబుల్ ఈ విషయాన్ని పోలీస్ ఉన్నతాధికారులకు తెలుపగా, వారి సూచన మేరకు కొమురయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం 24న కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతదేహం మూడు రోజులైనా మార్చురీలోనే ఉండడంతో విచారణకు సహకరించని మృతుడి కుమారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కానిస్టేబుల్ వెంకట్రామయ్య ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## ప్రభుత్వ ఫార్మసిస్టులు ఇకనుంచి ఫార్మసీ ఆఫీసర్లు

విద్యానగర్, ఏప్రిల్ 26: ప్రభుత్వ ఫార్మసిస్టులను ఫార్మసీ ఆఫీసర్‌గా పేరు మారుస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసినట్లు తెలంగాణ ఫార్మసిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూమ్ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రితో పాటు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, హెల్త్ సెక్రటరీ, హెల్త్ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్, టీవీవీపీ కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## బడుగు బలహీన వర్గాలు ఐక్యత చాటాలి

చిగురుమామిడి, ఏప్రిల్ 26: ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమాలు చేసిన బడుగు బలహీన వర్గాలు ఆత్మగౌరవం కోసం ఐక్యతను చాటుకోవాల్సిన అవసరం ఉందని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గీకురు రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీలకతీతంగా అందరం ఐక్యతగా ఉండి అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. ప్రభుత్వాలు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు రామోజీ రాజకుమార్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్, పెసరి శ్రీనివాస్, గంగుల లింగం, కుమార్ యాదవ్, లింగమూర్తి, శివాంజనేయులు, సంపత్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు మొండి చేయేనా..

- ప్రజాపాలన దరఖాస్తుదారుల ఆవేదన

శంకరపట్నం, ఏప్రిల్ 26: అన్ని అర్హతలు ఉన్నా ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో తమను విస్మరించారని ప్రజాపాలన దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేశారు. మొలంగూర్ గ్రామానికి చెందిన నర్సింగోజు రాణి, నర్సింగోజు సునీత శనివారం తమ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. తాము కొన్నేండ్లుగా అద్దె ఇండ్లల్లో నివసిస్తున్నప్పటికీ ఇందిరమ్మ ఇండ్ల జాబితాల్లో తమ పేర్లు లేవని తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. అర్హులైన తమను పక్కన పెట్టి, అనర్హులు, నాయకులకు నచ్చిన వారికి ఇండ్లు కేటాయించారని ఆరోపించారు. అధికారులు వెంటనే విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, ఇతర గ్రామాలకు చెందిన పలువురు దరఖాస్తుదారులు కూడా అన్ని అర్హతలు ఉన్న తమను విస్మరించి, అనర్హులకు ఎంపిక జాబితాలో చోటు కల్పించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తగిన విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## విద్యాలయాలను సందర్శించిన గురుకులాల కార్యదర్శి

చొప్పదండి/ తిమ్మాపూర్, ఏప్రిల్ 26: చొప్పదండి మండలంలోని రుక్మాపూర్ సైనిక్ స్కూల్‌ను శుక్రవారం సాయంత్రం ఎస్సీ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి రాత్రి బస కార్యక్రమంలో భాగంగా సందర్శించి బస చేశారు. శనివారం పాఠశాలలో కార్యకలాపాలను నిశితంగా పరిశీలించారు. వివిధ పోటీల్లో స్వయంగా పాల్గొనడంతో పాటు రెజ్లింగ్ పోటీలను తిలకించారు. ఆమె వెంట జోనల్ అధికారి భీమయ్య, హెడ్ ఆఫీస్ సిబ్బంది శర్మ, కిశోర్, పాఠశాల డైరెక్టర్ కర్నల్ కేసీ రావు, ప్రిన్సిపాల్ కాళహస్తి, ఆర్మీ సిబ్బంది, పాఠశాల సిబ్బంది ఉన్నారు. అలాగే, తిమ్మాపూర్ మండలం అలుగునూర్‌లోని సీవోఈని శుక్రవారం సాయంత్రం ఎస్సీ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి సందర్శించారు. విద్యాలయంలోని వసతులను పరిశీలించి, విద్యార్థులతో ముచ్చటించారు. వారికి పలు సూచనలు చేశారు.

## డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, ఏప్రిల్ 26: తల్లిదండ్రులు లేని అనాథలు, నిరాశ్రయుల పిల్లల కోసం మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దుర్గాబాయి దేశ్‌ముఖ్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి ఎం.సరస్వతి తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్, ఈఈఈ, సీఈ, ఈసీఈ విభాగాల్లో ఒక్కో బ్రాంచిలో 60 సీట్లు ఉన్నాయని, పదో తరగతి పాసై అనాథలు, తల్లిదండ్రులు కోల్పోయిన, నిరుపేద, అక్రమరవాణా బాధిత బాలికలకు 70శాతం సీట్లు కేటాయించినట్లు వెల్లడించారు. 3శాతం దివ్యాంగులకోసం రిజర్వు చేసినట్లు తెలిపారు. ఔత్సాహిక బాలికలు కుల, ఆదాయ, తల్లిదండ్రుల మరణ ధ్రువీకరణ పత్రాలు, టిసి, స్టడీ, ఎస్సెస్సీ మార్కుల మెమో జిరాక్స్ ప్రతులతో పూర్తి చేసిన దరఖాస్తుతో బస్టాండ్ ఎదురుగా గల జిల్లాపరిషత్ కార్యాలయంలోని బాల రక్షా భవన్‌లోని ఐసీపీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

## అనాథ వృద్ధుడికి అంత్యక్రియలు

విద్యానగర్, ఏప్రిల్ 26: శ్రీ వీర బ్రహ్మేంద్ర అనాథ వృద్ధుల ఆశ్రమం (విబి ఫౌండేషన్ ) నిర్వహణలో నడుస్తున్న నిరాశ్రయుల కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న పులికోట శ్యాంసుందర్ అనారోగ్యం ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అతడి భార్యకు సమాచారం అందించినప్పటికీ ఆమె స్పందించకపోవడంతో ఆశ్రమ నిర్వాహకుడు వీరమాధవ్ మున్సిపల్ సిబ్బంది సహాయంతో మానేరు వాగు ఒడ్డున అంత్యక్రియలు నిర్వహించారు. గత 22 సంవత్సరాలుగా నిరాదరణకు గురవుతున్న వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్న వీరమాధవ్, మృతులకు తానే స్వయంగా అంత్యక్రియలు నిర్వహిస్తూ మానవత్వం చాటుతున్నారు.

## చొప్పదండి బంద్ విజయవంతం

చొప్పదండి, ఏప్రిల్ 26: జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో హిందువులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన చొప్పదండి బంద్ విజయవంతం అయింది. పట్టణ ప్రజలు, వాణిజ్య వ్యాపార సంస్థల నిర్వాహకులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాస సుదర్శన్, నాయకులు, చొప్పదండి వ్యాపార వాణిజ్య సంస్థల నిర్వాహకులు, పట్టణ ప్రజలు, యువజన సంఘాల సభ్యులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

చొప్పదండి, ఏప్రిల్ 26: మండల కేంద్రంలో శనివారం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్, తెలంగాణ చౌరస్తా మీదుగా పోలీస్ స్టేషన్ వరకు 100 మంది ప్రత్యేక పోలీస్‌లు ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చొప్పదండి సీఐ ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీస్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల భద్రతకు పోలీసులు నిత్యం అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. శాంతి భద్రతకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చొప్పదండి ఎస్సై మామిడాల సురేందర్, రామడుగు, గంగాధర పోలీస్ స్టేషన్ల ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రిమాండ్ ఖైదీ మృతి

విద్యానగర్, ఏప్రిల్ 26: కరీంనగర్ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న ఎండీ సాదుల్లా శనివారం తెల్లవారు జామున స్థానిక ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలానికి చెందిన సాదుల్లా ట్రాక్టర్ దొంగతనం కేసులో నిందితుడిగా ఉన్నాడు. ఆయనతో పాటు మరో ఇద్దరిని ఈ నెల 18న అరెస్ట్ చేసిన ముస్తాబాద్ పోలీసులు కరీంనగర్ జైలుకు రిమాండ్‌కు పంపించారు. అయితే శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో సాదుల్లా తనకు ఛాతిలో నొప్పి వస్తోందని చెప్పడంతో జైలు అధికారులు కరీంనగర్ జనరల్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు. ఆరోగ్య పరిస్థితి విషమించి శనివారం తెల్లవారు జామున సాదుల్లా మృతి చెందాడు. సాదుల్లా మృతిపై కరీంనగర్ ఆర్డీవో మహేశ్ కుమార్ విచారణ జరిపారు. సాదుల్లాకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.

## 'విద్యా వాహిని' ద్వారా బడిబాట

గంగాధర, ఏప్రిల్ 26 : మండలంలోని ఒద్యారం, గట్టుభూత్కూర్, ఆచంపల్లి, చిన్నాచంపల్లి గ్రామాల్లో విద్యా వాహిన వాహనం ద్వారా శనివారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో, ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న నాణ్యమైన విద్య, సౌకర్యాలను గురించి తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

కార్పొరేషన్, ఏప్రిల్ 26: పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ రేకుర్తిలోని కాళోజీ నగర్ కాలనీవాసులు శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి, కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. రేకుర్తిలోని కాళోజీ నారాయణరావు విగ్రహం నుంచి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని, మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రీన్ హోమ్స్, వాల్యూ హోమ్స్, అక్షయ హోమ్స్, ఎలక్ట్రిసిటీ సిటీ కాలనీ, పోచమ్మ వాడ తదితర కాలనీల వాసులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 26: పహల్గాంలో ఉగ్రవాదుల దాడికి నిరసనగా హుజూరాబాద్ పట్టణంలోని మార్కెట్ రోడ్ వద్ద సామాజికవేత్త తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. అమరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో 27వ వార్డు మాజీ కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్, ఇస్సాక్, సుమంగళం మహేశ్, ముద్రకోల ఆనంద్, వేలూరి గిరిధర్, చందు, సుమంగళం భరత్, రఘు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.